ప్రజాశక్తి
గురువారం 30 మే 2024



పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 1వ తేదీన పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు ఎపి కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఒక విభాగం, 8 నుంచి 10వ తరగతి వరకు మరో విభాగం చొప్పున రెండు విభాగాల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలను గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 1వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 30, 31తేదీల్లో గురజాడ లైబ్రరీలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మనభూమి, మన భవిష్యత్తు, మేము జనరేషన్ పునరుద్దరణ అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

భానుడి భగ.. భగలు

- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- అవస్థల్లో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు
- 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



ఎండ నుంచి రక్షణకు ముఖాలకు ముసుగు వేసుకున్న పాదచారులు, ప్రయాణికులు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎండలు భగ్గు మంటున్నాయి. ఉదయం 9 గంటలు దాటితే ఇళ్లలోనుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయనే నానుడి ఉంది. దాన్ని నిజం చేసేలా ఎండలు కాస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, చిన్నారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. దానికి తోడు కరెంటు కోతలు ఉంటున్నాయి. గ్రామాల్లో, పట్టణాల్లో ఎండవేడిమికి తట్టుకోలేక చెట్లకిందకు వెళుతున్నారు.

ఈ ఏడాది వేసవి చాలా తీవ్రంగా ఉండనుందని (ఇండియా మెట్రోలాజికల్ డిపార్ట్మెంట్) ఐఎండి హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే ఎండ తీవ్రత కనిపిస్తోంది. రోహిణి కార్తె కావడంతో జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 43 నుంచి 44 డిగ్రీలు వరకు నమోదవుతున్నాయి. తాజాగా మంగళవారం విజయనగరంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలంతా ఉదయం 9గంటల్లోపే పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. దీంతో ప్రధాన రహదారులతో పాటు వీధులన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు వీలైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని గర్భిణులు, బాలింతలు, వృద్ధులు తగిన జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని, డీహైడ్రేట్ కాకుండా ఉండడానికి లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరినీరు తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మండల గ్రామాల్లో ఉండే ఆరేళ్ల లోపు పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. విజయనగరంలో బుధవారం ఎండకు చెట్లు కింద షాపుల్లో,పెట్రోల్ బంకులు కింద నీడ కోసం ఉండాల్సిన పరిస్తితి నెలకొంది. నగరంలో పుట్ పాత్ వ్యాపారులు 11 గంటల తర్వాత రోడ్డు మీద ఉండలేక,ఉక్క పోతకు షాపులు మూసేసి ఇళ్లకు చేరుకున్నారు. ఎండ వేడిమితో పాటు ఉక్క పోత అధికంగా ఉండటం, గాలి లేకపోవడంతో నగర వాసులు అల్లాడి పోయారు. లో ఓల్టేజ్ సమస్యతో ఫ్యాన్లు కూడా సరిగ్గా తిర్గక పోవడంతో ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు.భవన నిర్మాణ కార్మికులు ఉదయం 7 గంటల నుంచి 11 వరకు, మధ్యాహ్నం నాలుగు గంటల తర్వాత పనులు చేస్తున్నారు.



ఎండ ధాటితో నిర్మానుష్యంగా ఉన్న కలెక్టరేట్ కూడలి

సాలూరులో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

సాలూరు : మన్యం జిల్లా సాలూరులో గత మూడు రోజులుగా సూర్యుడు ప్రతాపానికి మాడు పగిలేట్టుంది. బయటికి వెళ్తే తిరిగి ఇంటికి చేరతామో లేదోనన్న భయం వెంటాడుతోంది. మంగళవారం పట్టణంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా, బుధవారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనం ఉదయం పది గంటల తర్వాత రోడ్డు మీదకు రావడానికి బెంబేలెత్తి పోతున్నారు. మధ్యాహ్నం పూట పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. బయటికి రాలేక ఇళ్లల్లో వుండలేక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లా కేంద్రం పార్వతీపురంలోను నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఒకపక్క ఎండ వేడి మరొక ఉక్క పోతతో ప్రజలు అల్లాడుతున్నారు. బుధవారం కూడా ఎండ వేడిమి అధికంగా ఉండడంతో పట్టణ ప్రజలు నివాస గృహాల నుంచి బయటకు వచ్చేందుకు ఏమాత్రం ఆసక్తి చూపించకపోవడంతో పట్టణ ప్రధాన రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తూ వెలవెలబోయాయి.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

బేషరతుగా లాకౌట్ ఎత్తివేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ
- యాజమాన్యంతో చర్చలు మరోసారి విఫలం

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ యాజమాన్యం బేషరతుగా లాకౌట్ ఎత్తివేసి కార్మికులందరికీ పని కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. జిందాల్ కంపెనీ వద్ద కార్మికులు చేస్తున్న నిరసన బుధవారం నాటికి 11వ రోజుకు చేరింది. ముందుగా కార్మికసంఘాల నాయకులు, కార్మికులు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ చర్చలో యాజమాన్యం తరఫున కంపెనీ జిఎం దినేష్ శర్మ, కంపెనీ జిఎం సుంకలాల్, హెచ్ఆర్ డిజిఎం గోపాల్ కృష్ణ, పాల్గొనగా, కార్మికుల తరఫున సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు, నిమ్మలపాలెం సర్పంచ్, కార్మిక నాయకులు నమ్మి చినబాబు, పిల్ల అప్పలరాజు, లగుడు వామాలు, పెదరెడ్ల ప్రసాదు చర్చల్లో పాల్గొన్నారు. ఇక్కడ పరిశ్రమను తెరిచే అవకాశం లేనందున కార్మికులు ఒడిశా రాష్ట్రం జాజిపూర్ వెళ్లాల్సిందేనని యాజమాన్య ప్రతినిధులు చెప్పారు. కార్మికులకు పని కల్పించడం తమ చేతిలో లేదని, జిందాల్‌టాప్ మేనేజ్మెంట్ చేతిలో ఉందని తెగేసి చెప్పారు. దీంతో చర్చలు విఫలమై కార్మిక సంఘాల నాయకులు వెనుతిరిగారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి తమ్మినేని మాట్లాడుతూ కార్మికులకు పోరాటమే మార్గమని అన్నారు. యాజమాన్యం దిగి వచ్చేంత వరకు పోరాటం ఆగదని అన్నారు. ఇప్పటికే చాలామంది కార్మికులు రిటైర్మెంట్ స్టేజ్ దగ్గరలో ఉన్నారని, యాజమాన్యం కార్మికుల ఉసురు పోసుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగివచ్చి బేషరతుగా పరిశ్రమను తెరిపించి కార్మికులకు పని కనిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ జిందాల్ యూనిట్ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిందాల్ యాజమాన్యం కార్మికులను రోడ్డుపై నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడం సరికాదని అన్నారు.కంపెనీ మూసివేసి రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని అన్నారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, కార్మిక నాయకులు బొట్ట రాము, సలాది భీమయ్య, బాలిబోయిన ఈశ్వరరావు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

మెజార్టీలపైనే పందేలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో ఎన్నికలపై పందేల జోరు పతాక స్థాయికి చేరుకుంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన వైసిపి, టిడిపి అభ్యర్థులు సాధించే మెజార్టీలపై బెట్టింగులు పెద్దఎత్తున నడుస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలోని వార్డులు, గ్రామాలు, పంచాయతీలు, పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందో వివరాలు సేకరించి, దాని ఆధారంగా బెట్టింగులకు పాల్పడు తున్నారు. నియోజక వర్గంలోని విజయనగరంలో 50 డివిజన్లు, మండలం లో 22 పంచాయతీల పరిధిలో మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు నువ్వా నేనా అనే రీతిలో సాగిన నేపథ్యంలో ఎవరి మెజార్టీ ఎంత అనే అంశంపై నాయకులు గణాంకాల సేకరణపై దృష్టి సారించారు. ఏ వార్డుల్లో, ఏగ్రామంలో ఎవరికి ఎంత, పంచాయతీల్లో ఎవరిది మెజార్టీ, పోలింగ్ బూత్‌ల ఆధిక్యం ఎంత, ఎవరికి మెజార్టీ ఎంత అనే అంచనాల ఆధారంగా మెజార్టీలను గణించే పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి సందిగ్ధ పరిస్థితుల్లో బెట్టింగురాయుళ్లు చెలరేగిపోతున్నారు. అయితే జూన్ ఒకటి నుంచి మరో రకమైన పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది.



ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, టిడిపి అభ్యర్థుల అసెంబ్లీ, పార్లమెంట్ స్థానంలో గెలుపు అవకాశాలపై పందేల జోరు కొనసాగుతోంది. పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో ఎక్కడ ఎంత మెజార్టీ లభించే అవకాశం ఉందనే అంచనాల బేరీజు వేసుకుని పందేలు కాస్తుండడం గమనార్హం. రూ. లక్ష మెజార్టీకి రూ. లక్షన్నర నుంచి రూ. మూడు లక్షల వరకు ఇస్తామనే పద్ధతిలో బెట్టింగు లు సాగుతుండడం గమనార్హం. నియోజక వర్గంలో ఫలానా పోలింగ్ బూత్ లో కూటమికి మెజార్టీ, ఫలానా పోలింగ్ బూత్‌లో వైసిపికి మెజార్టీ వస్తుందనే అంచనాలతో పందేలకు పాల్పడు తున్నారు. ఇలా నియోజక వర్గంలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పందేల జోరు కొనసాగుతోంది. మధ్యవర్తుల సహకారంతో ప్రామిసరీ బాండ్లు రాయించుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈనెల 13న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. జూన్ నాలుగున కౌంటింగ్ జరుగనుంది. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు 20 రోజుల వ్యవధిలో భారీ ఎత్తున బెట్టింగులకు పాల్పడుతున్నారు.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి లెక్కింపు కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. లెండి ఇంజనీరింగ్ కళాశాల, జెఎన్‌టియుజివిలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆమె బుధవారం పరిశీలించారు. ప్రతీ నియోజకవర్గ లెక్కింపు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టేబుళ్లు, సిబ్బంది కూర్చొనే విధానం, ఏజెంట్లకు చేసిన ఏర్పాట్లు, ఆర్‌ఓలు, అబ్జర్వర్ల సీటింగ్ ఏర్పాట్లు, వివి ప్యాట్‌ల లెక్కింపు గదులు, ట్యాబ్యులేషన్, ఎన్‌కోర్, ఫలితాల రాసేందుకు బోర్డులు, లెక్కింపు కేంద్రాలకు చేరుకొనేందుకు ఏర్పాటు చేసిన మార్గసూచికలు, బారికేడ్లను పరిశీలించారు. ఏజెంట్లు, సిబ్బంది వచ్చి వెళ్లేందుకు రెండు వేర్వేరు మార్గాలు ఉండాలని స్పష్టం చేశారు. తాగునీరు, టీ తదితర పానీయాలను లెక్కింపు కేంద్రాల్లోకి అనుమతించేది లేదని, వాటికి గదుల బయటే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగురూముల నుంచి ఇవిఎంలను నేరుగా లెక్కంపు కేంద్రాలకు తీసుకువచ్చే మార్గాన్ని పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేస్తూ కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్‌ఒలు, వేదికల ఇన్‌ఛార్జులు, నోడల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి తెలిపారు. మండలంలోని ఎల్ఎన్ పురంలో బుధవారం సచివాలయ వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి దోమల నివారణకు ఎసిఎం 5శాతం ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమ తెరలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఎసిఎం ద్రావణం పిచికారీ చేసిన గోడలకు మూడు నెలలు వరకు గోడలకు సున్నం వేయవద్దని, మళ్లీ మూడు నెలల తరువాత ఎఎంసి ద్రావణం పిచికారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొండ వెలగాడ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ధనుంజయ, సబ్ యూనిట్ అధికారి గోవిందరాజు, సూపర్‌వైజర్ జి.పైడిరాజు, సచివాలయ వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

అక్కడో రూలు.. ఇక్కడో రూలా?

- పక్క జిల్లాలో సెక్టార్ అధికారులకు రూ.15వేలు
- ఇక్కడ రూ.ఐదు వేలిస్తామని బేరాలు
- ఆర్‌ఒకు ఫిర్యాదు చేసిన వీడియోగ్రాఫర్లు
- కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీలో జాప్యమెందుకో?

ప్రజాశక్తి - సాలూరు

రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు. అలాగే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కలిసి పని చేస్తేనే ఎన్నికలు విజయవంతమవుతాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మరో నాలుగు రోజుల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. లెక్కింపు కోసం అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రక్రియలో భాగంగా విధులు నిర్వహించిన అధికారులకు, పిఒ, ఎపిఒ, ఒపిఒ, సిబ్బందికి కొంతమందికి అదేరోజు డబ్బులు చెల్లించారు. అయితే నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన సెక్టార్ అధికారులు, వివిధ టీముల్లో సభ్యులకు ఇంతవరకు చెల్లింపు జరగలేదు. సాలూరు నియోజకవర్గంలో 32 సెక్టార్ అధికారులకు చెల్లింపు చేయాల్సి ఉంది. పక్కనున్న విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సెక్టార్ అధికారులకు రూ.15వేలు చొప్పున చెల్లించారు. ఎవరికి ఎంత చెల్లించాలన్న దానిపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దాని ప్రకారం ఆ నియోజకవర్గాల్లో చెల్లింపులు జరిగిపోయాయి. ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, ఎంసిసి, వివిటి బృందాల లీడర్లకు రూ.10వేలు, సభ్యులకు రూ.8వేలు చొప్పున చెల్లించాలని, పక్క జిల్లా కలెక్టర్లు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. కానీ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ మాత్రం ఇంతవరకు ప్రొసీడింగ్స్ జారీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రొసీడింగ్స్ జారీ చేయకపోవడం వల్లనే స్థానిక నియోజకవర్గ ఎఆర్‌ఒ, తహశీల్దార్ సింహాచలం ఇంతవరకు చెల్లింపు చేయడం లేదనే విమర్శలున్నాయి. పొరుగు జిల్లాలో సెక్టార్ అధికారులకు రూ.15వేలు చెల్లిస్తే ఇక్కడ మాత్రం రూ.5వేలు ఇస్తానని తహశీల్దార్ సింహాచలం చెప్పడంతో వారు డబ్బులు తీసుకోలేదు. పోలింగ్ ముగిసి 15రోజులైనా ఇంతవరకు చెల్లించక పోవడంపై సెక్టార్ అధికారులు, వివిధ టీముల్లో పని చేసిన వీడియో గ్రాఫర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పక్క జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన వారికి ఒక రూలు, మన్యం జిల్లాలో పని చేసిన వారికి మరో రూలా అని సెక్టార్ అధికారులు,ఇతర సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఆర్‌ఒకు వీడియో గ్రాఫర్లు ఫిర్యాదు

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్‌కు బుధవారం ఎన్నికల టీముల్లో పని చేసిన వీడియో గ్రాఫర్లు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం తమకు చెల్లించాల్సిన డబ్బులు తహశీల్దార్ సింహాచలం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క జిల్లాలో వీడియోగ్రాఫర్లకు రోజుకు రూ.2500 నుంచి రూ.3వేలు చొప్పున చెల్లించారని, ఇక్కడ మాత్రం దానిలో సగం కూడా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. తాను ముగ్గురు వీడియో గ్రాఫర్లను పెట్టి 80రోజులు పని చేశానని, తనకు అడ్వాన్స్ రూపంలో రూ.50వేలు మాత్రమే చెల్లించారని మెంటాడ మండల వీడియో గ్రాఫర్ యుబివి రాజు చెప్పారు. తనకు ఇంకా రూ.లక్షా 50వేలు చెల్లించాల్సి వుందని చెప్పారు. మెంటాడ, పాచిపెంట వీడియో గ్రాఫర్ షేక్ అబ్దుల్ బాజీ, మక్కువ మండల వీడియో గ్రాఫర్లు ఆర్ఒ విష్ణు చరణ్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఆర్ఒ మౌనమెందుకో?

ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియోజకవర్గానికి ఆర్ఒ సుప్రీం అధికారి అయినా స్థానిక నియోజకవర్గ ఆర్ఒ విష్ణు చరణ్ మౌనం వహించడం చర్చ నీయాంశమవుతోంది. తహశీల్దార్ సింహాచలం పని తీరుపై ఆయన గతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు ఎన్నికల విధులు నిర్వహించిన వారికి చెల్లింపుల్లోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాయితీగా పని చేస్తున్న ఐఎఎస్ అధికారిగా విష్ణు చరణ్‌కు గుర్తింపు ఉంది. అయితే మండల తహశీల్దార్ సింహాచలం వ్యవహారంలో ఆయన మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లిఖిత పూర్వక ఫిర్యాదు అందిన తర్వాతైనా చర్యలు తీసుకుంటారా లేదా అనేది అంతుచిక్కడం లేదు.

చెత్త నుంచి సంపద తయారీ ఏదీ?

- మూలకు చేరుతున్న షెడ్లు
- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - గుర్ల

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను గత టిడిపి ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో నిర్మించింది. కొన్ని పంచాయతీలలో నిర్మాణాలు పూర్తి చేసింది. కొన్ని పంచాయతీల్లో మాత్రం పనులు పూర్తి కాలేదు. మండలంలో 31 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.లక్ష వెచ్చించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడలేదు. ప్రజా ధనం వృధా అయింది తప్ప ప్రభుత్వం ఆశయం మాత్రం నెరవేరలేదు. 2019 ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాజెక్టును పూర్తిగా వదిలేసింది. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలపై ఏమాత్రం దృష్టి సారించలేదు. గ్రామాలలో చెత్త సేకరణ చేసి, తడి పొడి చెత్తలను వేరుచేసి, వాటి నుంచి వర్మి కంపోస్ట్ తయారు చేసి పంటపొలాలకు ఎరువులుగా ఉపయోగించ వచ్చు అని అధికారులు చెప్పారు. కానీ ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ప్రస్తుతం ఈ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు గ్రీన్ అంబాసిడర్‌లను ప్రభుత్వం నియమించినా వారి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీలకు అప్పగించింది. పంచాయతీలు వీరికి సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో గ్రామంలో సేకరించిన చెత్తను ఆయా కేంద్రాలలో వేయక రోడ్ల పక్కన వేయడంతో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పరిసరాల పరిశుభ్రత లోపించడంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని స్థానికులు అంటున్నారు. ఈ పథకం పై ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసిన లక్ష్యం మాత్రం నెరవేరలేదని ప్రజలు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.



గూడెం గ్రామంలో రోడ్డు పక్కన వేసిన చెత్త



గుజ్జింగివలసలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

పట్టించుకోని అధికారులు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం పూర్తయినప్పటికీ నిర్వహణపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. నిర్మాణాలు పూర్తి చేయించిన అధికారులు, నిర్వాహణను విస్మరించారు. ప్రజా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజా ప్రతినిధులు అధికారులు సభలు సమావేశాలలో ఉపన్యాసాలు ఇస్తున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో మాత్రం వాటిపై దృష్టి సారించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయిన కేంద్రాలలో చెత్త నుంచి సంపద తయారు చేస్తే ప్రజాధనం వృధా కాకుండా ఉంటుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు దృష్టి సారించి కేంద్రాలను సక్రమంగా నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.



సారిపల్లిలో మాట్లాడుతున్న డిఎస్‌పి గోవిందరావు

కౌంటింగ్ తర్వాత విజయోత్సవాలు వద్దు

నెల్లిమర్ల: ఎన్నికల ఫలితాల తరువాత ఎటువంటి విజయోత్సవాలు చేయరాదని డిఎస్‌పి ఆర్. గోవిందరావు సూచించారు. బుధవారం సారిపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలోని అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించారని ఇదే స్ఫూర్తిని కౌంటింగ్ తరువాత కూడా అందరూ సంయమనం పాటించి ప్రశాంత వాతావరణానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల ఫలితాల తరువాత ఎటువంటి ఊరేగింపులు, విజయోత్సవాలు చేయరాదని వాటికి అనుమతులు ఇవ్వడం జరగదని తెలిపారు. ఫలితాలు వచ్చిన మూడు రోజుల పాటు 144 సెక్షన్ విధించడం జరుగుతుందని ఎటువంటి ఘర్షణలు, అల్లర్లు లేకుండా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐ బి.వి.వెంకటేశ్వర రావు, ఎస్‌ఐ డి. రామ గణేష్, గ్రామస్తుల పాల్గొన్నారు.

పల్లపు భూముల్లోనూ మొక్కల పెంపకం

వేపాడ: గతంలో మెట్ట భూముల్లో పండ్ల మొక్కల పెంపకానికి ఉపాధి హామీలో అవకాశం ఉండేదని ఇప్పుడు పల్లపు భూముల్లోనూ మొక్కల పెంపకానికి అవకాశం వచ్చిందని దీన్ని రైతులు వినియోగించుకోవాలని ఎపిఒ ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రైతులను గుర్తించి కొబ్బరి, మామిడి, జీడి, సపోటా, సీతాఫలం, నిమ్మ, దానిమ్మ, మునగ మొక్కలను పెంచడానికి అవకాశం కల్పించాలన్నారు. రైతుకు ఉన్న భూమిని బట్టి మొక్కలు అందజేస్తామని, ఇంకుడు గుంతల ఏర్పాటుకు కూడా రైతులను గుర్తించాలని సూచించారు. గతంలో మామిడి, జీడి మొక్కలు పెంపకం దారులకు మొక్క చుట్టూ మట్టి వేయడానికి, గట్టు ఎత్తి చేయడానికి నిధులు మంజూరు చేశామని, పండ్ల మొక్కలు వేసిన వారికి కూడా నిధులు మంజూరు చేస్తామని రైతులకు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

వాటర్ ఫాల్స్ వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

జామి: మండలంలోని ప్రమాదకరమైన జామి వాటర్ ఫాల్స్ వద్ద తహశీల్దార్ రాంబాయి హెచ్చరిక బోర్డును సిబ్బందితో ఏర్పాటు చేయించారు. స్థానిక ఎస్.ఐ వీరబాబు ఆధ్వర్యంలో పికెటింగ్ నిర్వహించారు. ఈ విషయంపై బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఈ వాటర్ ఫాల్స్‌లో చిక్కుకొని ముగ్గురు మరణించారని, ఈ ప్రమాదకరమైన వాటర్ ఫాల్స్ వద్దకు ఎవరు వెళ్ళవద్దని అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఈ దారిలో చెట్లు నరికించి వేయించిన ఎవరు ఆగకపోవడం బాధ కలిగిస్తుందని అన్నారు. ప్రమాదమని తెలిసినా వెళ్లడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని దయచేసి అందరూ అర్థం చేసుకొని ఈ ప్రమాదకరమైన ప్రాంతానికి వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంపై పోలీస్ పహారా ఉండేటట్లు చూడాలని ఎస్సై వీరబాబును తహశీల్దార్ ఆదేశించారు.

సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు

బొబ్బిలి: సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్ ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. స్థానిక సబ్ జైలులో రిమాండ్ ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. తెలిసీ తెలియక చేసిన తప్పులను తెలుసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఖైదీలకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు

రేగిడి: రాజాం అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి విజయనగరం లెండి కాలేజీలో జరగనుందని రిటర్నింగ్ అధికారి జోసెఫ్ రాజాం ఆర్వో కార్యాలయంలో బుధవారం తెలిపారు. ఈ ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్, 21 రౌండ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 2,27,503 ఓట్లకు గాను, 1,73,899 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటితోపాటు 3146 మంది పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు వేసినట్లు తెలిపారు. వీటిలో 311 సర్వీస్ ఓటర్లు ఉన్నాయి. అసెంబ్లీతో పాటు పార్లమెంటు కూడా 14 టేబుల్ ఏర్పాటు చేసి, ఓట్లు లెక్కింపు జరుగుతుందన్నారు. ఈ లెక్కింపులో కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల నియమ నిబంధనలు ప్రకారం అనుసరించాలని కోరారు.

గురుదేవా ట్రస్ట్ కార్యసిద్ధి గొప్పది

కొత్తవలస: మంగళపాలెంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్షలాదిమంది వికలాంగులకు సేవ చేయాలానే కార్యసిద్ధి చాలా గొప్పదని ఎస్-ఎఎల్‌పిజి మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ ముఖేజ అన్నారు. బుధవారం సిఇఒ వికాస్ వర్మ, సిఎస్‌ఆర్‌హెడ్ రామ్నాథ్ తో కలిసి గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్‌ను సందర్శించారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ చైర్మన్ జగదీష్ చేస్తున్న సేవలను కొనియాడారు. సేవ దృక్పథంతో ముందుకు అడుగులు వేయాలని, మరింత మంది నిరుపేదలకు ట్రస్ట్ అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ట్రస్ట్ సేవల్లో పాల్గొనడం తమ అదృష్టమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 20 మంది వికలాంగులకు కృత్రిమ కాళ్ళు, చేతులు, అందులకు బ్లైండ్ స్టిక్స్, క్యాలిపర్స్, వీల్ చైర్స్ పంపిణీ చేశారు. 50 మంది వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ మాట్లాడుతూ దాతలు సహకారంతో ట్రస్టును ఆసుపత్రిను నడిపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ డాక్టర్ ఫణీంద్ర, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి నేతలే భూ అక్రమార్కులు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ప్రభుత్వ భూములను వైసిపి నేతలే ఆక్రమించుకుంటున్నారని టిడిపి నాయకులు పంచాది కిరణ్ ఆరోపించారు. బుధ వారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నగర పంచాయతీలో ఏ మూల చూసినా ప్రభుత్వ భూములను వైసిపి నేతలు ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అలబాని వీధిలో సర్వే నంబర్ 311 రాస్తాను వైసిపి నేతలు ఆక్రమించుకుని కట్టడాలు చేశారని ఆరోపించారు. రాస్తా ఆక్రమణ వల్ల స్థానికులు దారి లేక గతంలో తహశీల్దారుకు కూడా ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఆక్రమించుకున్న వైసిపి నేతలు తమ పై అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. అలబాని వీధి రాస్తా ఆక్రమించుకున్న వైసిపి నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

8 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం

వేపాడ: మండలంలో ఉదయం 7 గంటలకే ఎండ ప్రారంభం కావడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఎండ తాపానికి వృద్ధులు బాలింతలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారుమ నరకయాతన పడ్డారు. ఎండలకు తోడు ఉక్కబోత కూడా అధికంగా ఉండటంతో ఇళ్లల్లో కూడా ఉండలేక చెట్ల నీడలకు, కళ్లాల వద్దకు ప్రజలు పరుగుతు తీశారు. దీనికి తోడు అడపాదడపా విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

దేవస్థానం ఆదాయం రూ.27.36లక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం హుండీల ద్వారా రూ.27,36,578 వచ్చింది. బుధవారం దేవస్థానం ఆవరణలో పర్యవేక్షక అధికారి పివి లక్ష్మీ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో మార్చి 11నుంచి ఈ నెల 28వరకు హుండీ ల ద్వారా రూ.27.36లక్షలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది ఇజ్జురోతు శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, ఐసిఐసి బ్యాంకు విజయనగరం సిబ్బంది, శ్రీవారి సేవ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాలకు స్టేషనరీ కొరత

- ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు
- చేతి చమురు వదిలించుకుంటున్న డిజిటల్ అసిస్టెంట్లు
- పట్టించుకోని సర్పంచులు, కార్యదర్శులు
- నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి

గ్రామ సచివాలయాలు ద్వారా ప్రభుత్వ సర్వీసులను ప్రజలకు సులువుగా అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చింది. ఈ వ్యవస్థలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, హౌసింగ్, ఇంజనీరింగ్, సామాజిక పెన్షన్లు తదితర 832 ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి అర్జీదారులు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే ఈ సర్వీసులకు సంబంధించి ఒక్కొక్క సర్వీసుకు ఒక్కో రేటు వంతున ప్రభుత్వానికి అర్జీదారులు నగదు కడుతుంటారు. అర్జీ చేసిన వ్యక్తికి రసీదు ఇవ్వవలసి ఉంది. కానీ సచివాలయాల లో ప్రభుత్వ సర్వీసులకు ఏ4 స్టేషనరీ కొరత కారణంగా అర్జీదారులకు రశీదులు ఇవ్వడంలో డిజిటల్ అసిస్టెంట్లు నానా పాట్లు పడుతున్నారు. కొన్ని సమయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు సొంత నగదు పెట్టి కొంత స్టేషనరీ కొనుగోలు చేసి మమ అనిపిస్తున్నారు. మరికొన్ని సచివాలయాల్లో సర్వీసులకు దరఖాస్తు చేసుకున్న అర్జీదారులే చేతి చమురు వదిలించుకుని స్టేషనరీ కొనుగోలు చేసి ప్రింటింగు తీసుకునే పరిస్థితి నెలకొంది.



స్టేషనరీ లేని రేగిడి సచివాలయం ఇదే..

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో 25 సచివాలయాలున్నాయి. ఈ సచివాలయాలలో నిత్యం ప్రభుత్వ సర్వీసులకు ప్రజలు, విద్యార్థులు, రైతులు తమ సమస్యలపై అర్జీలు చేసుకున్నప్పటికీ ప్రభుత్వానికి నగదు చెల్లించి ప్రింట్ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవంగా సచివాలయ వ్యవస్థలో గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మమేకమై స్టేషనరీ కొనుగోలు చేయవలసి ఉంది. ఈ స్టేషనరీ కొనుగోలుకు గ్రామపంచాయతీ జనరల్ ఫండ్‌లో బిల్లు చేసుకోవాల్సి ఉంది. కొంతమంది సర్పంచులు స్టేషనరీ కొనుగోలు చేసినప్పటికీ, మరికొన్ని సచివాలయాలలో ఏ4 స్టేషనరీ కొనుగోలు చేయక కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వ సర్వీసులకు అర్జీదారులు నగదు చెల్లించినప్పటికీ రసీదులు ఇవ్వలేక ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని పలు గ్రామాల నుంచి అర్జీదారులు పెదవి విరుస్తున్నారు. గత నాలుగు నెలలుగా సచివాలయాల నుంచి అర్జీలు చేసుకున్న వారికి ఏ4 స్టేషనరీ లేక డిజిటల్ అసిస్టెంట్లు రసీదులు ఇవ్వలేక డీలాపడ్డారు. ఎన్నాళ్లు సొంత నగదు పెట్టి కొనుగోలు చేసి ఇవ్వలాని అలా తాము ఇవ్వలేమని ఖరాకండీగా చెప్పేస్తున్నారు.

కొనుగోలు ఆపేసిన ప్రభుత్వం

సచివాలయాల్లో ఉపయోగించే స్టేషనరీ మొత్తం గతంలో ప్రభుత్వమే కొనుగోలు చేసి సచివాలయాలకు అందించేది. ప్రస్తుతం ప్రభుత్వం పంచాయతీ జనరల్ ఫండ్‌లో కొనుగోలు చేసుకోమని ఆదేశించడంతో సర్పంచులు ముందుకు రావడంలేదు. పైగా సర్పంచులు స్టేషనరీ కొనుగోలు చేయకపోయినా జనరల్ ఫండ్ నుంచి నగదు స్వాహా చేస్తున్నట్టు తెలుస్తుంది. వాస్తవానికి పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి సచివాలయాల నిర్వహణ, స్టేషనరీ ఖర్చులకు రూ.1500 కేటాయించాలని ప్రభుత్వం సూచించింది. కానీ కొంత మంది సర్పంచులు ఆ నిధులను స్టేషనరీ కొనుగోలుకు ఉపయోగించడం లేదు. కొంత మంది మాత్రం సచివాలయానికి కావాల్సిన స్టేషనరీ కొనుగోలు చేసి ఇస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. సర్పంచులు స్పందించని చోట అర్జీదారులు స్టేషనరీ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ సర్వీసులకు ఆటంకం లేకుండా సచివాలయాలకు నేరుగా స్టేషనరీ పంపించే విధంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

స్టేషనరీ కొరతతో ఇబ్బందులు



గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సర్వీసులకు నగదు చెల్లించినా రసీదులు కోసం డిజిటల్ అసిస్టెంట్లు స్టేషనరీ కొరత ఉందని, మీరే స్టేషనరీ తెచ్చుకొని రసీదు పొందాలని చెబుతున్నారు. మా బ్రదర్ సంకిలి సచివాలయానికి పోలీస్ సర్వీస్‌కు వెళితే స్టేషనరీ లేదు కొనుగోలు చేసుకోవాలని అన్నారు. గత నాలుగు నెలలుగా స్టేషనరీ లేక అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ4 తెల్ల కాగితాన్ని కొనుగోలు చేసి ప్రింట్ తీసుకోవాల్సి వస్తుంది. ముఖ్యంగా సర్పంచులు ఈ బాధ్యత తీసుకోవాలని, జనరల్ ఫండ్ నుంచి బిల్లు పెట్టుకోవాలని తెలిసినప్పటికీ బిల్లులు స్వాహా చేస్తున్నారు. కానీ స్టేషనరీ కొనుగోలు చేయడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో పట్టించుకోలేదు.

రవికుమార్, బాధితుడు రేగిడి.

సచివాలయాల నిర్వహణ బాధ్యత సర్పంచులదే

గ్రామ సచివాలయాల నిర్వహణ బాధ్యత సర్పంచులదే. పాలకవర్గం తీర్మానంతో అవసరం మేరకు జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయవచ్చును. ప్రభుత్వ సర్వీసులకు తప్పనిసరిగా స్టేషనరీ సర్పంచులు కొనుగోలు చేయాలి. బిల్లు పెట్టి తీసుకోవాలి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ఎవి సత్యనారాయణ, ఇఒపిఆర్‌డి, రేగిడి.


ఎస్.కోటలో క్రాస్ ఓటింగ్ గుబులు

- ఎగ్జిట్ పోల్స్ కోసం ఎదురు చూపులు
- గెలుపు ధీమా పై ఉత్కంఠ

ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోటకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. ఎన్నికల ఫలితాలపై క్రాస్ ఓటింగ్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. క్రాస్ ఓట్లు ఎవరి? కొంప ముంచితాయో అని ఇరు పార్టీలో కలవరం మొదలైంది. కానీ బయటకు మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే వచ్చే ఒకటో తేదీన విడుదల కానున్న ఎగ్జిట్ పోల్స్‌పై కొంత క్లారిటీ వస్తుందని బావిస్తున్నారు. మొత్తానికి ఎన్నికల ఫలితాలు ఇరు పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదనే చెప్పక తప్పదు. వివరాల్లోకి వెళితే..

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి, ఎన్‌డిఎ కూటమి మధ్య హోరా హోరీ పోటీ ఉందని ప్రచారం జరుగుతోంది. కానీ ఎస్.కోట నియోజకవర్గంలో భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వైసిపి నుంచి ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్న వ్యక్తి టిడిపికి పని చేయడం, ఏ మేరకు ప్రభావం ఉంటుందో అన్న చర్చ సాగుతోంది. మరో వైపు ఎమ్మెల్సీ భార్య పార్టీ వీడినప్పటికీ రఘురాజు కేడర్ పూర్తి స్థాయిలో పార్టీ వీడలేదు. వీరంతా బొత్స కుటుంబాన్ని అభిమానించే వారు, కావడంతో బొత్స ఫ్యాన్సీకి ఓటు ఖాయం అన్నది స్పష్టం. అయితే ఇలాంటి వారు క్రాస్ ఓటింగుకు పాల్పడే అవకాశం లేకపోలేదు. కానీ ఎన్నడూ లేని విదంగా ఎస్.కోట అసెంబ్లీ బరిలో తొలిసారి బొత్స మార్కు రాజకీయంతో ఆ పొరపాటు జరగనీయరన్న ధీమా వైసిపి కేడర్‌లో కనిపిస్తుంది. అందులో భాగంగానే వార్డు స్థాయి మొదలు కొని నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ బొత్స నేరుగా మాట్లాడి, రంగంలోకి దింపిన పరిస్థితి ఉందని అధికార పార్టీ బావిస్తుంది. ఇక టిడిపి విషయానికొస్తే, కోట తెలుగుదేశానికి కంచుకోట. గొంప కృష్ణ రాజకీయ అరగేట్రంతో టిడిపి బలం కుడా పుంజుకుంది. దీనికి తోడు ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో ఈ సారీ గెలుపుతథ్యం అని తెలుగు తమ్ముళ్లు బావిస్తున్నారు. కానీ గొంప వర్గంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు ఎంపి అభ్యర్థి భరత్‌కు ఓటు పక్కా అయినప్పటికీ, ఎమ్మెల్యే ఓటు విషయంలో క్రాస్ ఓటింగు పడే అవకాశం ఉందన్న ఆరోపనులు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఇరు పార్టీలకు క్రాస్ ఓటింగ్ బెడద ఉందని సర్వత్రా చర్చ సాగుతోంది. ఎవరు గెలిచినా, తక్కువ మెజారిటీతో గెలుస్తారన్న నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ గెలుపోటములపై ప్రభావం ఉంటుందని వి శ్లేషకులు అంచనా.



ఎగ్జిట్ పోల్స్ సర్వేల కోసం ఎదురు చూపులు

ఎవరికీ వారు గెలుపు ధీమాలు వ్యక్తం చేయడంతో, ఇరు పార్టీ కేడర్లలో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయాన్నే విడుదల అయ్యే ఎగ్జిట్ పోల్స్ సర్వే కోసం జనం ఆశకస్తిగా చూస్తున్నారు. లేని యెడల నాలుగో తేదీ కౌంటింగ్ ఫలితాలే శిరోధార్యం మరి.



మొక్కులు తీర్చుకుంటున్న టిడిపి నాయకులు

ఘనంగా సామాలమ్మ పండగ

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని దమరసింగి గ్రామంలో సామాలమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామదేవత సామలమ్మ అమ్మవారికి పూజలు చేశారు. పండగ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అమ్మవారిని దర్శించికొని పూజలు చేశారు. రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు చనామాల మహేశ్వరరావు, జనసేన నాయకులు రమేష్ రాజు, బిసి సెల్ కార్యదర్శి డి శివప్రసాద్, ఐటిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరి శ్రీరాములు అన్నారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్ కోట కేం బ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న 132 మంది క్రీడాకారులతో బుధవారం ఉదయం పుణ్యగిరి కొండపైకి 118 మంది క్రీడాకారులతో హిల్ ట్రెక్కింగ్, నీటి జలపాతానికి చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, కోచ్ లు మొహమ్మద్ అస్లాం, బి. హారిక, పి.మౌనికలు తీసుకువెళ్లారు. శ్రీరాములు క్రీడాకారులతో మాట్లాడుతూ ఈ హిల్ ట్రెక్కింగ్ వల్ల కండరాల దారుఢ్యం, స్టామినా, మానసిక ఆనందం అభివృద్ధి చెందుతాయని అన్నారు.



ట్రెక్కింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు, కోచ్ శ్రీరాములు

మట్టి మాఫియా ఆగడాలను ఆపేదెవరు?

- రెవెన్యూ అధికారుల మొద్దు నిద్ర
- యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు
- చెరువుకు పోయే బట్టీలు ఆక్రమించినా చర్యలు శూన్యం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని రెవెన్యూ అధికారులు నిద్రావస్తులో ఉన్నారా అంటే అది నిజమే అని చెప్పాలి. ఎందుకంటే చెరువులలో అక్రమంగా గ్రావెల్, మట్టి జెసిబిలతో తవ్వినా పట్టించుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. చెరువులకు నీరు పారే బట్టీలనూ ఆక్రమించినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ఏది జరిగిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మండలంలోని పలుకువలస రెవెన్యూ పరిధిలో గోపి నాయుడు చెరువులో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జెసిబితో మట్టి, గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ 600 రూపాయలకు అమ్ముకొని వ్యాపారం చేస్తున్నారు. చెరువులో గ్రావెల్ తవ్వాలంటే ప్రభుత్వ అనుమతులు ఉండాలి. కానీ ఎటువంటి అనుమతులూ లేకుండానే ఇష్టానుసారంగా జెసిబి పెట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమార్కులతో రెవెన్యూ సిబ్బంది చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా తెర్లాంలో దాసరిబంధ చెరువుకు వెళ్లే జలధార కాలువను గ్రామానికి చెందిన వ్యక్తులు ఆక్రమించి ఆ కాలు మధ్యలో గోడలు కట్టేశారు. దీన్ని కూడా సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. అయితే చెరువు ఆయకట్టు రైతులు బొబ్బిలి రెవెన్యూ డివిజనల్ అధికారికి ఫిర్యాదు చేస్తే నిర్మాణాలు ఆపారు. కానీ ఇంతవరకు వాటిని తొలగించలేదు. ఇన్ని జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు రకాలుగా ప్రజలు పెదవి విరుస్తున్నారు. మట్టి మాఫియా మండలంలో విచ్చలవిడిగా ధైర్యంగా రాత్రనకా పగలనకా మట్టి బకాసురులు మట్టి తవ్వుకొని లక్షల రూపాయలు సంపాదిస్తుంటే అడ్డుకోవాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ప్రతి చెరువులోనూ ఇదే వ్యవహారం జరుగుతున్నా నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న విఆర్‌ఒలు, ఆర్ఐ, తహశీల్దార్ ఇకనైనా దృష్టి సారించి చెరువులను కాపాడాలని ఆయకట్టు రైతులు ప్రజలు కోరుతున్నారు.



మట్టిని జెసిబితో ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న అక్రమార్కులు

సంత అక్రమ లైసెన్సుపై విచారణ

ప్రజాశక్తి - జామి

మండలంలోని లోట్లపల్లి పంచాయతీ అలమండ పశువులు సంతకు అక్రమంగా లైసెన్స్ మంజూరు చేశారన్న దానిపై వచ్చిన ఫిర్యాదుపై బుధవారం విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య జాయింట్ డైరెక్టర్ పశుసంవర్ధశాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వారిపై విచారణకు గంట్యాడ పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రెడ్డి కృష్ణ హాజరయ్యారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన, విచారణ సందర్భంగా హాజరైన కమిటీ సభ్యులందరి నుంచి రాత పూర్వకంగా స్టేట్మెంట్ ఇవ్వాలని సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారు రాష్ట్ర గో సంరక్షణ సమైక్య కమిటీ సభ్యులు చోళ్ల రాజకుమారి మాట్లాడుతూ జీవో నెంబర్-23, రాష్ట్ర హై కోర్టు ఆదేశాలు మేరకు పశువులు సంతల్లో సీసీ కెమెరాలు, ర్యాంపులు, మంచినీటి కుండీలు, షెడ్లు, గడ్డి, దాణా, ఇన్-అవుట్ గేట్, రిజిస్టర్, అన్నీ సదుపాయాలు కల్పించిన మీదటనే లైసెన్స్ మంజూరు చేయాలసి ఉండగా, అధికారులు లైసెన్స్ మంజూరు చేయడం దారుణమన్నారు. ఈ విషయమై విచారణ జరిపి అధికారులుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విచారణకు అలమండ పశువైద్యులు డాక్టర్ నరేష్, జామి పశు వైద్యులు డాక్టర్ 'అప్పలనాయుడు, జామి మండల విస్తరణ అధికారి శ్రీదేవి, వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఐశ్వర్య లక్ష్మి, లోట్లపల్లి సెక్రటరి రొంగళి ఎర్నమ్మ, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ సిబ్బంది ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, డివిజనల్ జంతు సంక్షేమ కమిటీ సభ్యులు చీడి రామకృష్ణ, నీలాపు దేవి తదితరులు పాల్గొన్నారు.

54 మిగులు సీట్లు భర్తీ

నెల్లిమర్ల: జిల్లాలో అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో 54 మిగులు సీట్లు భర్తీ జరిగినట్లు ప్రిన్స్‌పాల్ కె.ఉషారాణి తెలిపారు. బుధవారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి మిగుల సీట్లు భర్తీకి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో జిల్లాలోని నెల్లిమర్ల, చీపురుపల్లి, వేపాడ, వియ్యంపేట, కొమరాడ, గరుగుబిల్లిలో ఉన్న మొత్తం ఖాళీలు 143కి గాను ఎస్‌సి 38, ఎస్‌టి 1, బిసి 14, ఒసి 1 మొత్తం 54 సీట్లు లాటరీ విధానంలో జిల్లా సమన్వయ అధికారి టి. పద్మజ ఆధ్వర్యంలో భర్తీ చేశారు. ఈ కౌన్సెలింగ్‌కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల హెచ్‌ఎంలు టి.ఎం ఫ్లోరెన్స్, టి. జయశ్రీ, ఏ. రాణిశ్రీ, టి.రామదాసు, ఎల్. పద్మావతి, సంధ్య హాజరయ్యారు.

గ్రంథాలయంతో విజ్ఞానం

ప్రజాశక్తి- డెంకాడ

గ్రంథాలయాలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి మహేష్ అన్నారు. వేసవి శిబిరంలో భాగంగా ఆయన బుధవారం విద్యార్థులకు పరమానందయ్య శిష్యుల కథ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు చెస్, లుడో, కేరమ్, స్నేక్ అండ్ లీడర్ వంటి క్రీడలను ఆడిం చారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి : గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై రవి బాబు విద్యార్థులకు బుధవారం స్పోకెన్ ఇంగ్లీషును బోధించారు. బాడంగి గ్రంథాలయాధికారి ఆర్. దుర్గా ప్రసాద్ కంప్యూటర్ బేసిక్స్ నేర్పించారు. పిల్లలకు చదరంగం, కథలు చదివించడం, ఆటలు ఆడించారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే అన్ని రకాల పుస్తకాలతో పాటు 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని వీటిని వినియోగించుకోవాలని బాడంగి గ్రంథాలయాధికారి కోరారు.

జామి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరంలో బుధవారం లైబ్రరియన్ స్వామినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో కథా పఠనం, నాటకం, కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



డెంకాడ: కథలు పుస్తకాలు చదువుతున్న మహేష్

పౌష్టికాహారం తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహక ులకు బుధవారం పౌష్టికాహారం తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జి. లక్ష్మీ పదార్థాలలోని పోషకాలు కోల్పోకుండా ఆహారాన్ని ఎలా తయారు చేయాలి, అలాగే వంటి చేయడానికి ముందుర ఆహార పదార్థాలను ఎలా శుభ్రపరచాలి అనే విషయాలను తెలియజేశారు. ముఖ్యంగా ఆహారం తయారు చేసే ప్రదేశం, పరిసరాలు, వంటి పాత్రలు పరిశుభ్రత గురించి ఆమె వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఎండిఎం నిర్వహకులు అడిగిన సందేహాలను లక్ష్మీ నివృత్తి చేశారు. శిక్షణ అనంతరం నిర్వాహకులకు ఆహార పదార్థాల తయారీపై పోటీని నిర్వహించారు. ఈ పోటీల్లో కె. తరంగిణి జెడ్‌పి హైస్కూల్ గోవిందపురం, వి.హెచ్. భారతి ఎంపిపిఎస్ గొల్లపేట, టి. ఆదిలక్ష్మి ఎంపిపిఎస్ పూసపాటిరేగ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎండిఎం కోఆర్డినేటర్ సత్యం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఎండిఎం నిర్వాహకులు పాల్గొన్నారు.



పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్ లక్ష్మీ, తదితరులు

వారణాసి రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్

బంగారాన్ని పోగొట్టుకున్న బొబ్బిలి వాసి

ప్రజాశక్తి- బొబ్బిలి

వారణాసి రైల్వే స్టేషన్‌లో జరిగిన చైన్ స్నాచింగ్‌లో బొబ్బిలి పట్టణానికి చెందిన గొట్టాపు త్రినాథరావు భార్య భవాని బంగారాన్ని పోగొట్టుకున్నారు. త్రినాథరావు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 14న కాశీ వెళ్లారు. కాశీ నుంచి ఈనెల 18న తిరుగు ప్రయాణం అయ్యారు. 14న వారణాసి రైల్వే స్టేషన్‌లో ఉదయం 9గంటల సమయంలో రైలు కోసం ప్లాట్‌ఫాంపై వేచి చూస్తుండగా ముగ్గురు గుర్తు తెలియని మహిళలు ప్రయాణికులు లాగా ఉండి భవాని మెడలో ఉన్న 68 గ్రాముల బంగారు నగలను కట్టర్‌తో కట్ చేసి దోచుకున్నారు. కొన్ని నిమిషాలు తర్వాత మెడలో బంగారు నగలు లేకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశామని భవాని, భర్త త్రినాథరావు చెప్పారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చైన్ స్నాచింగ్ చేసిన ముగ్గురు మహిళలను రైల్వే పోలీసులు అరెస్టు చేశారన్నారు. చోరీ చేసిన బంగారు నగలను వేరే వ్యక్తి ద్వారా తరలించారని, ఇప్పటికీ తమకు ఇవ్వలేదని భార్య, భర్తలు వాపోయారు. రైల్వే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి బంగారాన్ని రికవరీ చేసి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఆటో ఎక్కించి ఉంగరం కాజేశాడు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరానికి చెందిన కోళ్ల బుచ్చయ్య చౌదరి నగరంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఒక ఆటో డ్రైవర్ అతనిని ఆటోలో ఎక్కించుకొని, ఒక నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లిన తరువాత, అతని చేతికి ఉన్న ఉంగరం, జేబులోగల రూ.1500నగదు బలవంతంగా తీసుకొని వెళ్లిపోయాడు. బాధితునికి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు ఈనెల 29న పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం ఎస్ఐ తారకేశ్వరరావు, వన్‌టౌన్ క్రైం పోలీసులు ఆటో నంబరు ఆధారంగా నేరానికి పాల్పడిన వాడిని పాత నేరస్తుడు అయిన గజపతినగరం మండలం మధుపాడ గ్రామానికి చెందిన తాడ్డి రవి అనే ఆటో డ్రైవర్ గా గుర్తించారు. రవిని కలెక్టరేట్ జంక్షన్ వద్ద బుధవారం అరెస్టు చేసి అతని నుంచి ఉంగరాన్ని రికవరీ చేసి, రిమాండుకు తరలించామని సిఐ బి.వెంకటరావు తెలిపారు. గతంలో కూడా ఇదే తరహాలో వన్ టౌన్ పిఎస్ పరిధిలో తాడ్డి రవి నేరానికి పాల్పడినట్లు సిఐ తెలిపారు. కేసును గంటల వ్యవధిలోనే ఛేదించిన క్రైమ్ బృందాన్ని సిఐ బి.వెంకటరావు అభినందించారు.